కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 16 ఆగష్టు 2026

## బాగా చదివి ఉన్నత స్థానంకు చేరాలి



**దువ్వూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త:** హైస్కూల్లో చదివే విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానంకు చేరాలని ఎంపీడీవో జవహర్ బాబు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 10వ తరగతి విద్యార్థులలో అధిక మార్కులు సాధించిన వారికి వివిధ రకాల ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గతానికి భిన్నంగా ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఉన్నాయని వాటిని వినియోగించుకొని బాగా చదివి ఉన్నత స్థానం కు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వ హైస్కూల్ లలో చదివితే మంచి విద్య అందుతుందని అన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది 10వ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించిన వారికి దువ్వూరు టౌన్ ఇన్చార్జ్ పాపినేని రాంబాబు కొంత మొత్తం నగదును అందించారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు ఆవుల శ్రీనివాసులు మార్కులు సాధించిన వారికి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రమణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### సీఐ నాగభూషణ్



**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా పిల్లలను సరైన మార్గంలో నడిపించాలని సీఐ నాగభూషణ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, దైనందిన కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలకు పాల్పడిన పలువురిని అరెస్టు చేసి బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, వివాదాలు మరియు ఘర్షణలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. మద్యం, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని యువతను చెడు మార్గాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సమయంలో పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మదనపల్లెలో మిన్నంటిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త.** చారిత్రాత్మక బీటీ కాలేజ్ మైదానంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇన్ ఛార్జ్ జిల్లా కలెక్టర్ శివ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిలతో కలిసి మంత్రి పరేడ్ పరిశీలన చేసి, రాష్ట్రీయ సెల్యూట్ స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్వతంత్ర భారతావని కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్ర్య సమర యోధుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. దేశ స్వేచ్ఛ కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా నవసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వ్యవసాయం, తాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు వీలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మారుస్తూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని, అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు భాగస్వాములు కావాలని మంత్రి ఆకాంక్షించారు.

**స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు సత్కారం**

స్వాతంత్ర్య సమరయోధులు లేట్ సి. శ్రీనివాసరావు, జె.సిద్ధప్ప నాయుడు, ఎం. పాపన్న గుప్తా, డివి నారాయణ శెట్టిల కుమారులు సి. సీతారామయ్య, జె. భవాని ప్రసాద్, ఎంపీ మోహన గుప్తా, డివి భాస్కర్ శెట్టిలను మంత్రి ఘనంగా సత్కరించారు.

**అలరించిన ప్రగతి శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు:**

వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని ప్రతిబింబించేలా 12 రకాల శకటాల ప్రదర్శన, పాఠశాల విద్యార్థుల దేశభక్తి నృత్యాలు, కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థుల వీరోచిత విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

**ప్రగతి శకటాలు:** ప్రథమ రవాణా శాఖ, ద్వితీయ డ్వామా, తృతీయ విద్యాశాఖ.

**సాంస్కృతిక విభాగం:** ప్రథమ ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల పాఠశాల, ద్వితీయ పీపుల్ ట్రీ స్కూల్, తృతీయ కలికిరి సైనిక్ స్కూల్.

**ప్రదర్శన స్టాల్స్:** ప్రథమ వ్యవసాయ శాఖ, ద్వితీయ స్త్రీ శిశు సంక్షేమ శాఖ, తృతీయ పరిశ్రమల శాఖ. విజేతలకు మంత్రి, ఇన్ ఛార్జ్ కలెక్టర్, ఎస్పీ కలసి జ్ఞాపికలు అందజేశారు.

ఈ వేడుకల్లో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డిఆర్ఓ వెంకటేష్, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కడప, ఆగస్టు 15 ప్రభాతవార్త.** స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో శనివారం ఉదయం అత్యంత వేడుకగా కన్నుల పండువగా ప్రారంభమైన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ వేడుకలలో గౌరవ రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసి డా. నిధీ మీనా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9.00గం లకు వందేమాతరం గీతాలాపన అనంతరం రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి మైదానంలో పటాలాలను పరిశీలించారు. వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం జిల్లాలో చేపట్టి, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు రాష్ట్ర మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి సందేశమిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి.. మైదానంలో పటాలాలను పరిశీలిస్తున్న మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అధికారులకు ఉత్తమ పురస్కారాలు



**మదనపల్లెక్రైం, ఆగస్టు 15 ప్రభాతవార్త.** తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, సేవాభావం, నిజాయితీలే పునాదిగా ప్రభుత్వ సేవల్లో రాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకే రోజు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకొని కుటుంబానికి, ప్రాంతానికి ఘనకీర్తి తీసుకువచ్చారు. కీర్తిశేషులు చెంగమ్మ, కీర్తిశేషులు భూక్యా చవాలా నాయక్ (రిటైర్డ్ వీడీఓ) దంపతుల మొదటి కుమారుడు భూక్య మురళీమోహన్ పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, రెండవ కుమారుడు బి. త్యాగరాజు తంబళ్లపల్లిలో మండల విద్యాశాఖ అధికారిగా, మూడవ కుమారుడు బి. హరినాథ్ నాయక్ అన్నమయ్య జిల్లాలో సహాయ సమాచార పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ తమ శాఖల్లో విశిష్ట సేవలకుగాను ప్రశంసా పత్రాలు అందుకున్నారు. భూక్య మురళీమోహన్ (ఎక్సైజ్ సీఐ, పుత్తూరు) విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం స్వీకరించారు. బి. త్యాగరాజు (ఎంఈఓ, తంబళ్లపల్లి) మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. బి. హరినాథ్ నాయక్ (ఏపీఆర్ఓ, అన్నమయ్య జిల్లా) మదనపల్లెలో జరిగిన వేడుకల్లోనే మంత్రి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అధికారులు అత్యున్నత పురస్కారాలు పొందడం స్థానికంగా విశేషంగా నిలవగా, తల్లిదండ్రులు అందించిన ఆదర్శవంతమైన విలువలకే ఈ అవార్డులు నిదర్శనమని పలువురు ప్రముఖులు, అధికారులు వారిని అభినందించారు.

## ప్లాస్టిక్ రహిత సంచుల పంపిణీ




**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 15 ప్రభాతవార్త** స్థానిక మున్సిపల్ మైదానంలో శనివారం పదివేల ప్లాస్టిక్ రహిత సంచులను కొవ్వూరు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి పిలుపుమేరకు స్వచ్ఛ, ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు కొరకు అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు రొటేరియన్ కొవ్వూరు రమేష్ రెడ్డి వెంటనే స్పందించి విద్యార్థిని, విద్యార్థులకు రోటరీ హాస్పిటల్ నందు వ్యాసరచన పోటీలను పెట్టి ప్లాస్టిక్ రహిత స్టెయిన్లెస్ స్టీల్ బాటిల్ను అందించడం మరియు ఆగస్టు 15 కార్యక్రమానికి మున్సిపల్ గ్రౌండ్ నందు జరిగిన స్వచ్ఛ సంకల్ప దీక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొని తన సొంత ఖర్చులతో స్పాన్సర్ గా క్లబ్ అధ్యక్షుడిగా పదివేల ప్లాస్టిక్ రహిత చేతి సంచులను ఎమ్మెల్యే నంద్యాల వరదరాల రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చేత ప్రజలకు, సభకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఈ సంచులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు తయారు చేసుకుందామని పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని పిలుపు ఇచ్చారు. కమిషనర్ తప్పనిసరిగా మనందరం స్వచ్ఛ ప్రొద్దుటూరు ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు చేయాలని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులన్నీ ప్లాస్టిక్ వల్లనే వస్తున్నాయని ప్రతి ముగ్గురిలో ఒకరు క్యాన్సర్ పేషెంట్ గా మారిపోతున్నారని కావున మనమంతా కలిసి ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరుకు ఈ క్షణమే నడుం బిగిద్దామని ఈ క్షణమే నా వంతుగా నేను ప్రతిజ్ఞను పాటిస్తూ పదివేల సంచులను ప్లాస్టిక్ రహిత సంచులను ప్రజలు కొరకు ఉచితంగా ఏర్పాటు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఒక్ఫోడ్ స్టేట్ డైరెక్టర్ బేపారి జాకీర్, రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీధర శర్మ, ఎన్జీవో ప్రెసిడెంట్ రామసుబ్బయ్య, మాజీ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి, అయూబ్ ఖాన్ మునిసిపల్ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### తహాశీల్దార్ కార్యాలయంలో ఘనంగా

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**పీలేరు ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినో త్సవాన్ని పురస్కరించు కొని పీలేరు పట్టణ తహాశీ ల్దార్ కార్యాలయం లో శనివారం ఆగస్టు 15 వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సం దర్భంగా తహాశీల్దార్ శివకుమార్ జాతీయ జెండాను ఆవిష్క రించి జెండా వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తహాశీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మన కర్తవ్యం. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చూడటమే నిజమైన దేశసేవ" అని అన్నారు. పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకో వాలని, ప్రజాసేవలో అంకితభావంతో పనిచేయాలని తహసిల్దార్ శివకుమార్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్, కోట పల్లి సర్కిల్, నాలుగు రోడ్ల కూడలి, పంచాయతీ కార్యాలయం, ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ కార్యాలయం, కోర్టు, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

## దేశభక్తికి ప్రత్యేక నిదర్శనం

### స్వాతంత్ర్య దినోత్సవమే వారి ఇంటి పెళ్లి ముహూర్తం
### మూడు తరాలుగా ఆగస్టు 15నే వివాహాలు



ఆగస్ట్ 15 శనివారం జరిగిన 3వ తరం వివాహం

**పులివెందుల, ఆగస్టు 15 , ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతుండగా, పులివెందులకు చెందిన ఓ కుటుంబంలో మాత్రం ఆగస్టు 15 ప్రత్యేకంగా పెళ్లి ముహూర్తంగా మారింది. మూడు తరాలుగా అదే తేదీన వివాహాలు జరుపుకుంటూ దేశభక్తికి ప్రత్యేక నిదర్శనంగా నిలుస్తున్నారు. పులివెందులకు చెందిన విశ్రాంత కానిస్టేబుల్ బికారి సాహెబ్, హుసేన్బీ (మృతి) దంపతుల వివాహాన్ని ఆయన తల్లి దస్తగిరమ్మ దేశభక్తి భావనతో 1974 ఆగస్టు 15న జరిపించారు. ఆ సంప్రదాయాన్ని కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ, రెండో తరానికి చెందిన బికారి సాహెబ్ కుమారుడు దాదా సాహెబ్ - రేష్మాల వివాహాన్ని 1997 ఆగస్టు 15న నిర్వహించారు. ఇప్పుడు మూడో తరానికి చెందిన సలీమ్ మహ్మద్ - అయేషాల వివాహం కూడా ఈరోజు (ఆగస్టు 15) కడపలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజే మూడో తరం వివాహం జరగడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బికారి సాహెబ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని తమ కుటుంబంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తామని, మూడు తరాలుగా ఆగస్టు 15నే వివాహాలు జరుపుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో తమ మనవళ్ల వివాహాలను కూడా ఇదే రోజున జరిపించాలనే సంకల్పంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కుటుంబ సంప్రదాయం పులివెందులలో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

### ఘనంగాప్రారంభం అయిన శ్రీ గండి వీరాంజనేయ స్వామి

## శ్రావణమాస మహోత్సవం

### 8 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ,,



**వేంపల్లి, ఆగష్టు 15, ప్రభాతవార్త** గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో శ్రావణమాస మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, స్వామివారి దర్శన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పించగా, కడప జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. సుమారు 8 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. గూడూరు రామరెడ్డి కుటుంబ సభ్యులు రూ.50,116, ఎస్.ఐ. భార్గవ్ దంపతులు రూ.30,116, శేషాద్రి శేఖర్ దంపతులు రూ.20,232, ఎస్. రామమోహన్‌రెడ్డి రూ.10 వేలు, బుక్కే నాగేశ్వరరెడ్డి దంపతులు రూ.12,232 చొప్పున విరాళాలు అందించారు. అన్నదానం పీఓఎస్ ద్వారా కూడా విరాళాలు అందాయి. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, వైద్య సిబ్బంది, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు సేవలందించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత ఏడాది మొదటి శనివారంతో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రస్తుత ఏడాది మొదటి శనివారం రూ.15,51,669 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు, సహాయ కమి షనర్-కార్యనిర్వహణాధికారి సి. విశ్వనాథ్, దేవాదాయశాఖ సిబ్బంది, పోలీసులు, వైద్య సిబ్బంది, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలందించారు.

## శ్రీశక్తి పథకానికి ఏడాది పూర్తి

### ఆర్టీసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే



బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణం ప్రవేశపెట్టి ఆగస్టు 15నాటికి ఏడాది పూర్తియిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలను పకలరిస్తూ ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం కల్పించడం పట్ల మహిళల స్పందనను అడిగి తెలుసుకొన్నారు. కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ళ పాలనలో చేపట్టిన సంఏమ పథకాల అమలపై మహిళలతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వందశాతం ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. పెన్షన్ రూ.4వేలకు పెంచి, ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ, రైతు భరోసా, తల్లికి వందనం, శ్రీశక్తి పథకం అమలు వంటి పథకాలతో రాష్ట్ర ప్రజలకు చేరువ అయ్యిందన్నారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజాపాలన సాగుతుందని రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఆర్ఎం. డిపో మేనేజర్లు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో**



మండల పరిధిలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ నందు 80వ స్వతంత్ర వేడుకలను మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. తదానంతరం పదవ తరగతిలో మండలం ఫస్ట్ వచ్చిన షేక్ అత్తర్ రహఫ్ 585 మార్కులు సాధించి నందుకు లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ రెడ్డి చర్ల. నాగేశ్వరరావు 20 వేలు ప్రైజ్ మనీ గా ఇవ్వడం జరిగినదనియు, ఇలాగే ప్రతి సంవత్సరం మండల టాపర్ గా నిలిచిన మా స్కూల్ విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో**

బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు నారిశెట్టి సుప్రజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండావందనం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లైస్ విజిలెన్స్ డైరెక్టర్ తుదిమెళ్ల మురళి, మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రమౌళి, డైరెక్టర్లు ప్రతాప్, కోడికూతల శివశంకర్, చిన్ని సుబ్బారావు, బొమ్మనా ప్రత్యుష, కాకర్ల వెంకటసుబ్బయ్య, నాగరాజు, కుప్పయ్య, తిరువీధి హుస్సేనమ్మ, నందకిశోర్ దంపతులు, రమణాచారి, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సుప్రజ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు.

**ముద్దనూరులో..**



మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఏడీఏ కె. రామమోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా దేశ ప్రజలంతా ఐక్యంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ నగేష్‌బాబు ఆధ్వర్యంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎండీఓ రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.

**పీలేరులో**

దేశభక్తి, జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా పీలేరులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాడవాడలా మువ్వన్నెల పతాకాలు వినీలాకాశంలో రెపరెపలాడుతూ జాతీయతను చాటాయి. న్యాయస్థానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య సంబరాలు నిర్వహించారు. స్థానిక కోర్టు సముదాయంలో 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ. మహేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి పెద్ద ఖాసీం, జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, స్పెషల్ కోర్టు జడ్జి శారద, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్సైలు, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శివకుమార్, ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ హరితా వెంకటరమణ, ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవోలు యుగంధర్, దొరస్వామి, ఎంఈఓలు బాబు నాయక్, పద్మావతి, ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు వగళ్ళ చంద్రారెడ్డి, విశ్రాంత సైనికోద్యోగుల సంఘం కార్యాలయంలో సంఘ నాయకులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులు జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని దేశభక్తిని చాటారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వక్తలు వివరించారు. వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థలు, శ్రీభువన విద్యాలయంలో కరస్పాండెంట్లు వడ్లమూడి మాధవి, ఉమా రమాదేవి ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.



**జాతి నేతలను స్ఫూర్తిగా పయనించాలి**



**చౌడేపల్లిలో** స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తును చక్కగా మలచుకోవాలని పలువురు పిలుపునిచ్చారు. శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్యం వచ్చిన తీరు, జాతీయ నాయకుల జీవిత్ర చరిత్రలను గురించి విద్యార్థులకు వివరించారు. అదే విధంగా ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎంపిడివో కార్యాలయంలో ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపిడిఓ లాలీమాధవి, తహశీల్దార్ కార్యాలయం ముందు తహశీల్దార్ పార్వతమ్మ, ఆరోగ్యకేంద్రం, పోలీస్టేషన్ ఎదుట డాక్టర్ మోనా, పుంగనూరు రూరల్ సిఐ సాయిప్రసాద్, బోయకొండ వద్ద ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాల వద్ద ఆయా అధికారులు జాతీ యజెండాను ఎగురవేశారు. స్థానికులు, అధికారులు, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు.

**ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రం..**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణం సర్కిల్ పోలీస్ స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా అన్నమయ్య జిల్లా మదనపల్లె పరేడ్ మైదానం నందు రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎస్పి దీరజ్ కునుబిల్లి చేతుల మీదగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ పి సునీల్ కుమార్ మాట్లాడుతూ, 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ అందించిన ఈ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని తన సేవా ప్రయాణంలో మరింత అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేందుకు ప్రేరణగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా కృషి చేస్తానని పి సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఉత్తమ విధులకు లభించిన ఈ గుర్తింపు పోలీసు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని, సేవా స్ఫూర్తిని నింపుతుందని అధికారులు తెలిపారు.



**కురబలకోటలో..** శనివారం కురబలకోట మండలంలో 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. , తెట్టు ,కరబలకోట గ్రామ సచివాలయాలో జాతీయ జెండాను ప్రత్యేక అధికారులు ఎంపీడీవో గంగయ్య, డిప్యూటీ ఎంపీడీవో బాలమూర్తిలు ఎగరవేశారు. దేశ నాయకులు చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గంగయ్య, మోడల్ స్కూల్లో ఎంఈఓ ద్వారకనాథ్, తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ధనుంజయులు, ట్రాన్స్కోలో ఏ ఈ శంకర్ రెడ్డి, పోలీస్ స్టేషన్లలోఎస్సై మధు రామచంద్రుడు, తెట్టు గ్రామ సచివాలయం లో సెక్రటరీ రామప్ప నాయుడు, అంగళ్ల హై స్కూల్ లో ఎంపీడీవో గంగయ్య, అంగళ్ల సచివాలయలో ప్రత్యేక అధికారి, . విండో కార్యాలయంలో జయరామిరెడ్డి, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.



**రామసముద్రంలో..**



రామసముద్రం మండలంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పాఠశాలలు, స్వర్ణగ్రామ కార్యాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి, పశువైద్యశాల, ఎక్సయిజ్ చెక్పోస్ట్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

**దేశభక్తిని చాటిన విద్యార్థుల తిరంగ ర్యాలీ**

**నిమ్మనపల్లిలో..**



మండలంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. విద్యార్థులు చేపట్టిన తిరంగ ర్యాలీ దేశభక్తిని చాటింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో, పాఠశాలల యందు జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రమేష్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి, ఎంపీడీఓ ఫక్రుద్దీన్, ఎఒ రమేష్ జెండాను ఆవిష్కరించగా, ఎస్సై రామకృష్ణ, ఎంఈఓ లు పద్మావతి, నారాయణ, మండల అధికారులు వారి కార్యాలయాల్లో జెండాను ఆవిష్కరించారు.

## యామవరంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ముద్దనూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:

ముద్దనూరు మండలం యామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాత దేవిరెడ్డి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎస్. జాహ్నవికి రూ.5,001, కె. శృతికి రూ.3,001, వి. సౌజన్యకు రూ.2,001 నగదుతో పాటు జ్ఞాపికలు, పతకాలు అందించారు. ప్రత్యేక ప్రోత్సాహకంగా కె. ప్రవీణ, ఎం. పూజిత, సి.జి. హర్షితలకు ఒక్కొక్కరికి రూ.1,001 నగదు, జ్ఞాపికలు అందజేశారు. వివిధ విషయాల్లో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.501 చొప్పున బహుమతులు అందించారు. గణితంలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థికి పి. చందుకు రూ.2,001 నగదు, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. అరుణాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయులారా మన్నించండి...!

### అధికారుల నిర్లక్ష్యం



స్వాతంత్ర్య సంబరాల్లో నేలపాలైన మహనీయుల చిత్రపటం

చౌడేపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త

దేశభక్తి అనేది జెండా ఎగరేసి కొంత కొన్ని నిమిషాలు ప్రదర్శించే ముచ్చటకాదు.. జాతీయనేతలను స్మరించుకొని వారి ఆశయసాధన దిశగా అడుగులేయాల్సిన తరుణమిది...అయితే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలచాయి. జాతీయ పతాకం నింగికి ఎగరేసి మహనీయుల చిత్రపటాన్ని నేలకొదిలేసిన సంఘటన శనివారం మండల పరిపాలనా భవనం ముందు చోటు చేసుకొంది. భవన ప్రాంగణంలో జాతీయజెండాను ఎగరేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో జెండాతోపాటు మహాత్మాగాంధీ, బాబూరాజేంద్రప్రసాద్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటాన్ని వుంచారు. పటానికి పూజ చేసి కొబ్బరికాయ కొట్టిన తర్వాత జాతీయజెండాను ఎగురవేశారు. అక్కడికి వచ్చిన వారందరికీ చాక్లెట్లు పంచి పెట్టిన అధికారులు వెంటనే కార్యాలయంలోకి వెళ్ళి పోయారు. కాగా జెండాకింద కుర్చీపై వున్న మహనీయుల చిత్రపటం కిందకు పడిపోయింది. అరగంటపాటు అలానే దుమ్ముధూళికి పడున్నా ఎవరూ పట్టించుకోక పోవడం గమనార్హం. పడున్న దృశ్యం " వార్త "క్లిక్‌మనిపంచడంతో గుర్తించిన అధి కారులు వెంటనే ఫోటోనులోనికి తీసుకెళ్ళారు. మహనీయుల చిత్ర పటాన్ని నేలపాలు చేసి వారి ఆశయాలను అవమానించిన అధికారులపై ఉన్నతాధికారు లు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని చూసిన ప్రతి ఒక్కరూ అన్నారు.

## గాంధీ మార్గం సమస్యల పరిష్కారంకు సులభతరం



పీలేరు, ఆగస్టు 15 ప్రభాతవార్త

స్వాతంత్రం దినోత్సవం పురస్కరించుకొని క్రమశిక్షణకు మారుపేరుగా రాష్ట్రంలో వివిధ రకాల సమస్యలను పరిష్కరించే వ్యవస్థ రెవెన్యూ వ్యవస్థేనని అటువంటి రెవెన్యూ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం గాంధీ మార్గంలో ప్రయాణించేందుకు సులభం అవుతుందని కలికిరి మండల పరిధిలో రెవెన్యూ కార్యాలయం ఆవరణములో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 80వ స్వాతంత్ర దినోత్సవం లో భాగంగా గాంధీ మహాత్ముడికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కలికిరి రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సిబ్బందితోపాటు వీఆర్వోలు శిల్ప ఆదిలక్షి ్మ, గౌరీ, రెడ్డి రాణి తో పాటు పలువురు సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఏఎస్ఓ లు తమ భావాలను వ్యక్తపరిచారు.

## నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



బద్వేల్, ఆగస్టు 15 ప్రభాతవార్త

బద్వేల్ స్థానిక తెలుగు గంగ కాలనీలో ఉండే నారాయణ ఒలంపియాడ్ పాఠశాల యందు 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో ఎంతో అందంగా ముస్తాబయ్యారు. దేశభక్తి గేయాలకు విద్యార్థులు వేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రవీణ్ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలమే మన స్వాతంత్రం అని ఆ మహానుభావుల త్యాగాలను స్మరించుకో వడం మనందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజియం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్, అకడమిక్ డీన్ నరసింహులు,వైస్ ప్రిన్సిపల్ రఘురామిరెడ్డి, పావని, రాజేశ్వరి, అనూష, ఏ ఓ, శ్రీనివాసులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



సిద్దవటం, ఆగష్టు 15, ప్రభాతవార్త

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాల్లో శనివారం ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి జాతీయ జెండా రెపరెపలాడింది. సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో కడప 3వ ఏడియం మెజిస్ట్రేట్ ఇంచార్జ సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ విజయలక్షి ్మ జాతీయ జెండాను ఎగురవేశారు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పణి రాజకుమారి ఏవో సోమశేఖర్ పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ విజయ్ కుమార్,ఏపీఎస్పీ 11వ బెటాలియన్ లో కమాండెంట్ ఆనంద రెడ్డి,ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో సీఐ రాజశేఖర్, జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం సునీత, ఫారెస్ట్ ఆఫీసులో డిఆర్ఓ ముక్తార్ భాష, సిద్ధవటం పోలీస్ స్టేషన్ లో ఎస్సై శ్రీనివాసులు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ చిరంజీవిరెడ్డి, భాకరాపేట జడ్పీ హైస్కూల్ నందు హెచ్ఎం లక్ష్మి కేసమ్మ మరియు రాజంపేట టిడిపి మాజీపార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య కడితం రామ్మోహన్ నాయుడు సిద్ధవటం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్ క్లస్టర్ ఇంచార్జ రాజానాయుడు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పార్ల సంజీవ రాయుడు శ్రీ నలంద హై స్కూల్ నందు కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య సాయి హైస్కూల్ లో పోలు వెంకటసుబ్బయ్య మరికొన్ని కార్యాలయాల్లో ఆశాఖ అధికారులు, ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేసి వందన స్వీకారం గావించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



మదనపల్లెక్రైం, ఆగష్టు 15 ప్రభాతవార్త.

అనారోగ్యం తాళలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం, చీకులపల్లి పంచాయతీ బార్లపల్లికి చెందిన లేట్ రామన్న కుమారుడు సి. సదాశివ (58) వికలాంగుడు. ఆయనకు భార్య విజయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా సదాశివ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి యత్నించారు. గమనించిన కు టుంబ సభ్యులు వెంటనే ఆయనను మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

## మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేతులు మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రంఅందుకున్న ఏ ఈ మస్తాన్ వల్లి



రామసముద్రం, ఆగస్టు 15, ప్రభాతవార్త:

80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మదనపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో రామసముద్రం మండలం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మస్తాన్ వల్లి ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నాణ్యత, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారం, రైతులకు సకాలంలో సేవలు అందించడంలో చూపిన చొరవకు గాను ఈ గౌరవం దక్కింది. మంత్రి రాం ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా మస్తాన్ వల్లికి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

## ఉత్తమ ప్రతిభ అసిస్టెంట్ ఇంజనీర్‌గా వెంకటమహేష్



కాశినాయన, ఆగస్టు15, ప్రభాతవార్త .

పోరుమామిళ్ల సబ్ డివిజన్ పరిధిలోని పోరుమామిళ్ల సెక్షన్ విద్యుత్ శాఖలో ప్రజలకు విద్యుత్ సరఫరా, బిల్లులు కలెక్షన్లు, ప్రజలసమన్వయంతో విధుల పట్ల సంస్థ కు అహర్నిశలు కృషి, సేవలు చేస్తూ,సిబ్బంది చేత నాణ్యమైన విద్యుత్ ప్రజలకు సరఫరా చేసినందుకు ఉత్తమప్రతిభ కలిగిన అసిస్టెంట్ ఇంజనీర్ గా వెంకటమహేష్ కు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ప్రశంస పత్రంతో ఏ. ఇ వెంకట మహేష్ ను జిల్లా విద్యుత్ శాఖ అధికారులు సత్కరించారు.

## ఉత్తమ ప్రతిభ అవార్డు రావడం అభినందనీయం

### లివింగ్ స్టోన్ డేవిడ్



రాయచోటి, ఆగస్టు 15 ప్రభాతవార్త

రాయచోటి విద్యుత్ శాఖ విభాగానికి 2026 సంవత్సరానికి గానూ ఉత్తమ ప్రతిభ అవార్డు రాయచోటి సబ్ డివిజన్ కు రావడం చాలా అభినందనీయ పరిణామమని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లివింగ్ స్టోన్ డేవిడ్ తెలిపారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ :రాయచోటి డివిజన్‌కు ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం చాలా గర్వకారణం. ఈ ఘనత సాధించినందుకు గాను శనివారం చిత్తూరులో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఏపీ ఎస్‌పిడీసీ ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఐఏఎస్ చేతుల మీదుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లింగ్ స్టోన్ డేవిడ్ ఉత్తమ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



రామాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త :

మండలంలోని 13 గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలలు స్వర్ణ గ్రామ సచివా లయాల్లో జాతీయ బ్యాంకుల వద్ద శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మొదటిగా రామాపురం పోలీస్ స్టేషన్లో సిఐ కృష్ణంరాజు నాయక్. హసనాపురం స్వర్ణ గ్రామ సచివాలయంలో స్పెషల్ ఆఫీసర్‌గా తాసిల్దార్ వెంకటేశ్వర్లు, తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ కృపావతి. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జాషువా. చిట్లూరు స్వర్ణ గ్రామ సచివాలయంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గాలివీడు సురేందర్ రెడ్డి. గోపగుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మానా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ బ్యాంకుల వద్ద బ్యాంక్ అధికారులు. జాతీయ జెండాను ఎగరవేసి పలువురికి స్వీట్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణంరాజు నాయక్ తాసిల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందురో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ఆయన అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ అభివృద్ధికి కుటమీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగు తోందని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మానా చంద్రశేఖర్, రామాపురం మండల టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు మండల. గ్రామా.స్థాయి అధికారులు. ఉపాధ్యాయులు. తదితరులు పాల్గొన్నారు.



## 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





గోపవరం. ఆగస్టు 15. ప్రభాతవార్త.

భారతదేశపు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు బద్వేల్ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పిల్లలు దేశభక్తి గీతాలతో నృత్యలు చేయడం అనంతరం జండా వందన కార్యక్రమాన్ని నిర్వహించారు ఆగస్టు 15 నాడు ప్రభుత్వ శాఖలలో మంచి నైపుణ్యం కలిగినటువంటి ఉద్యోగులకు ఆర్డిఓ చంద్రమోహన్ బద్వేల్ ఎమ్మార్వో తిరుమల బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ లో గోపవరం మండలంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నటువంటి తలారి శివ కుమార్ కు ఉత్తమ ప్రశంస అవార్డు అందజేయడం జరిగింది తలారి శివ కుమార్ స్వగ్రామం లక్షీ ్మపాలెం ఈ బెస్ట్ ఎంప్లాయ్ అందుకో వడం ఎంతో సంతోషకరమని భవిష్యత్తులో ఇంకా బాగా కష్టపడి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి ఆగస్టు 15 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారతదేశ 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జెండాను ఎగరవేసి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా మనకు స్వాతంత్రం లభించిందని, వారి త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుండగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. యువత దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలవాలని, క్రీడలు, విద్య, ఉపాధి రంగాల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయా లను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో ఐక్యత, సోదరభావం, దేశభక్తిని పెం పొందిస్తూ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని మంత్రి కోరారు.

## గుర్రంకొండలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



గుర్రంకొండ, ఆగష్టు 15, ప్రభాతవార్త

గుర్రంకొండలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయా లలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. శనివారం ప్రభుత్వ కార్యాలయాలు మువ్వన్నెల జెండాలను ఉదయం నుండీనే సిద్ధం చేశారు. స్దానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి, తాశిల్ధార్ కార్యాలయంలో ఫణిస్వా మి, పోలీస్‌స్టేషన్‌లో రవీంధ్ర, సింగిల్‌వెండ్ కార్యాలయంలో ఎమ్ఎల్ఎన్ మూర్తి రావు, విశ్వభారతి పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకం్‌రెడ్డి, మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కార్యాలయాలలో మువ్వన్నెల జెండాను భక్తి శ్రద్దలతో ఎగురవేయడం జరిగింది. ఈ సంధర్బంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోదుల మన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నాయిని శివశంకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ యస్. మురళీకృష్ణ, అనిల్‌కుమార్, మార్కెట్ కమిటి ఉపాధ్యక్షులు నౌషాద్‌అహ్మద్, డైరెక్టర్‌లు యస్. బయారెడ్డి, శ్రీనివాసులు, జయంత్, చలపతి, రామాంజులు, సుంకర శేకర్, యస్. వెంకటరమన, యన్. రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





గాలివీడు, ఆగస్టు 15, ప్రభాతవార్త:

గాలివీడులోని శ్రీ రవి చంద్ర దితీళిని పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పిల్లి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిల్లి నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో విద్యలో రాణించి దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానెయిల్, సైజు థామస్, ప్రిన్సిపాల్ లీజా జాయ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఉత్తమ కంప్యూటర్ ఆఫరేటర్‌గా నరసింహ రెడ్డి**



గాలివీడు మండల విద్యాశాఖ కార్యాల యంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహారెడ్డి ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్"గా ఎంపికై సత్కారం అందుకున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ సంబంధిత పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల వివరాలు, పాఠశాలల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడంలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం మరియు ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## రాయచోటి మున్సిపాలిటీలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలు



రాయచోటి ఆగస్టు 15 ప్రభాతవార్త :

శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలను రాయచోటి మున్సిపాలిటీలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయచోటి ఆర్డిఓ, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొని జెండా వందనం చేశారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్ రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తో కలిసి వృత్తిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది తమ తమ కార్యక్రమాలు సజావుగా చేసుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం, ప్రజల సౌకర్య కోసం తమ వంతుగా పాటుపడాలని, అలా మెరుగైన సౌకర్యం ప్రజలకు అందించినప్పుడే పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు.

## స్వతంత్ర సమరయోధుల త్యాగఫలమే స్వతంత్ర దినోత్సవం



పెద్దమండెం, ఆగస్టు 15 ప్రభాతవార్త

80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు స్వతంత్రం కోసం పోరాడిన సమరయోధులు సర్దార్ వల్లభాయ్ పటేల్ భగత్ సింగ్,కట్ట బ్రహ్మన్న అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి. మహాత్మా గాంధీ తదితర సమరయోధులు తమ ప్రాణాలను అర్పించి బ్రిటిష్ వారితో పోరాడి స్వతంత్రాన్ని సంపాదించే ఇవ్వడంతో మనము స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నామని అన్నారు మండలంలో అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం అమరవీరుల వేషధారణలో కేఎన్ఆర్ పాఠశాల విద్యార్థులు పురవీధుల గుండా తిరుగుతూ స్వతంత్ర పోరాటవీరులను స్మరించుకున్నారు అనంతరం కరస్పాండెంట్ రఘురామిరెడ్డి జండాఎగురవేసి జండా వందనం చేశారు.

## ఉత్తమ సర్వేయర్‌గా బాలకృష్ణ



పీలేరు ఆగస్టు 15 ప్రభాతవార్త:

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున మదనపల్లి నందు బీటీ కాలేజ్ ఏర్పాటు చేసిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శనివారం రవాణా శాఖ మంత్రివర్యులు, స్పోర్ట్స్ మిస్టర్, రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదగా ఉత్తమ సర్వే అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఉత్తమ సర్వేయర్‌గా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. గ్రామాలలో భూ సమస్యలను సర్వే ద్వారా తక్షణమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

# ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**సుండుపల్లె, ఆగష్టు 15,ప్రభాతవార్త :**

మండలంలోని ఉన్నత పాఠశాలలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వం అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టుల ద్వారా భర్తీ చేయనున్నదని విద్యాశాఖ అధికారి బి. వెంకటేష్ నాయక్ తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దీనిలో భాగంగా మండలంలో మొత్తం 17 అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులు మంజూరైనవి. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4 పోస్టులు, ప్రాథమిక పాఠశాలలో 13 పోస్టులు ఉన్నవి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టులకు బిఈడి మరియు టెట్ పాస్ అయి ఉండవలెను. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డీఎడ్ మరియు టెట్ పాస్ అయి ఉండవలెననియు, దరఖాస్తులను 16.08.2026 నుండి 21.08.2026 వరకు స్థానిక మండల ఎంఆర్సి నందు ఇవ్వాలనియు, అలాగే ఖాళీల వివరాలను కూడా ఎమ్మార్సీ నందు తెలుసుకోవచ్చునని తెలియజేశారు.

# విధి నిర్వహణకు గుర్తింపు

**ఒంటిమిట్ట ఆగస్టు.15. ప్రభాతవార్త.**



స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కడప జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల సందర్భంలో శనివారం బాధ్యతాయుత విధి నిర్వహణలో భాగంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా మెరిట్ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం జరిగింది. పోలీసు శాఖలో అంకితభావంతో విధి నిర్వహణ ,శాంతి భద్రత పరిరక్షణ ,ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో, నేరాల నియంత్రణ, సమర్థవంతమైన పరిరక్షణ తదితర అంశాల్లో చూపుతున్న చొరవకు నిదర్శనంగా ఆయనకు గుర్తింపు లభించింది. భవిష్యత్తులో కూడా శాంతి భద్రతలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

# ఉత్తమ ఎంపీడీవోగా సురేష్ బాబు

**రాజుపాలెం, ఆగస్టు 15, ప్రభాతవార్త.**



మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్‌బాబు శనివారం కడప పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఎంపీడీవో అవార్డును మంత్రి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తించినందుకు గుర్తింపు లభించి అవార్డు అందుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# ఉత్తమ సేవలకు పురస్కారం

**పీలేరు ఆగస్టు 15 ప్రభాతవార్త:**



స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గాలివీడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నంద్యాల్ మోహన్ కుమార్ ఎంపిక కావడంతో మదనపల్లిలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పోలీసుగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం జీవితంలో మర్చిపోలేని విషయమని మోహన్ కుమార్ అన్నారు

# మార్కెట్‌యార్డులో అన్నదానం



కార్మికులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డులో హమాలీలకు శనివారం అన్నదానం నిర్వహించారు. హమాలీ యూనియన్ టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో మండి యూనియన్ గౌరవ అధ్యక్షులు, హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జయరామిరెడ్డి, ఎస్ఏ.మస్తాలు జాతీయ జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంపిపెట్టారు. అనంతరం హమాలీలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు రామయ్య చాన్‌బాషా, మహబూబ్‌బాషా, మురషారసుల్, సుబ్రమణ్యం, శివ, జాఫర్, సాధిక్ రోషన్, పెద్దసంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

# ఘనంగా జడ్పీహెచ్ఎస్ గ్రౌండ్ ప్రారంభోత్సవం



**కలసపాడు, ఆగస్టు 15 ప్రభాతవార్త:**

మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ ప్రారంభోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ మాలిని ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ గ్రౌండ్ ను గ్రామ ప్రజల సహకారం, దాతల సహకారంతో నిర్మించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ మస్తాన్ వలి, కలసపాడు మండల మాజీ జెడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి, కాజీపేట బాయ్స్ హై స్కూల్ హెడ్ మాస్టర్ బోడెద్దుల బాల అంకిరెడ్డి, రేనాటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామంలోని ప్రజలు మరియు గ్రౌండ్ కు సహకరించిన దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా ఎల్లంపల్లి ప్రశాంత్

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :**



మదనపల్లె పట్టణానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు ఎల్లంపల్లి ప్రశాంత్‌ను భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపి రాష్ట్ర వ్యాపంగా పలు జిల్లాలకు స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్లను బిజెపి అధిష్టానం ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మదనపల్లెకు చెందిన ఎల్లంపల్లి ప్రశాంత్‌ను స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పట్టణంలో 20ఏళ్ళుగా బిజెపి బలోపేతానికి కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో బిజెపి పటిష్టత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ తరపున ఎంపి, ఎమ్మెల్యేగా పోటీచేసిన అభ్యర్థులకు గెలుపు కోసం నిరంతరం కృషి చేశారు. ఈయన సేవలను గుర్తిస్తూ బిజెపి యూత్ అధ్యక్షులుగా, అన్నమయ్య జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈయనకు జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకులతో సన్నిహిత సంబంధాలు కలవు. ఈయన పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్రస్థాయిలో కీలక పదవిని కట్టబెట్టింది. ఆర్యవైశ్యుల సామాజిక వర్గానికి చెందిన ఈయనకు వారి కులానికి చెందిన ముఖ్య నాయకులతో పరిచయాలు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చినందుకు పార్టీలో పలువురు అభినందిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రశాంత్ నియామకంపై మదనపల్లె నియోజకవర్గంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు హర్షం తెలిపారు.

# వినూత్న నిరసనతో రోడ్డుపై వరి నాటిన గ్రామస్తులు

**కలసపాడు, ఆగస్టు 15 ప్రభాతవార్త:**

అధికారులు, రాజకీయ నాయకులు మారుతున్నా రాజుపాలెం గ్రామ పంచాయతీ అభివృద్ధి మాత్రం ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోతుందని, రోజుల తరబడి మురికినీరు అలాగే ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. నిరసనగా రోడ్డుపై వరి నాటుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టి తమ ఆవేదన వ్యక్తం చేశారు.

# వైభవంగా శ్రావణ శనివారం పూజలు

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :**



స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా శ్రీఅభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామికి, అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి వైభవంగా పూజలు జరిగాయి. పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ తొలి శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ నవీన్‌చౌదరి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని పలు ఆలయాలు శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.

# త్యాగమూర్తుల పుణ్యఫలం భారతావని స్వాతంత్రం

**కడప కార్పొరేషన్ ఆగస్టు 15 ప్రభాతవార్త:**

ఎందరో త్యాగమూర్తుల పుణ్యఫలం భారత స్వాతంత్ర్యమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు అభిప్రాయపడ్డారు. శనివారం కడప బీసీ భవన్ కమిటీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్, గోవింద్ నాగరాజు, గౌరవ అధ్యక్షులు గురుస్వామి ,ప్రధాన కార్యదర్శి మూలకాని త్రివిక్రమ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కళ్యాసుధాకర్, ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ భాష, కోశాధికారి మనుబోలు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు,మంచాల సుబ్బరాయుడు, వాల్మీకి రామచంద్రయ్య, ఓబయ్య, జె. నరసింహ, మునిరత్నం, ఆర్ల గంగయ్య, నరసింహులు, మహిళా నాయకురాలు, తొర్రి వేముల జయశ్రీ, జింక జయలక్ష్మి, నగర కమిటీ అధ్యక్షుడు, గొడుగు హరికుమార్, ప్రధాన కార్యదర్శి మేకల సురేంద్ర ఉపాధ్యక్షులు, గొడుగు సూర్యుడు, సింహాద్రి, శ్రీను, యువజన ప్రధాన కార్యదర్శి, రేవనూరు మల్లికార్జున పాల్గొన్నారు.



# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జెండావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :**

పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వాడవాడ మువ్వెన్నల జెండా రెపరెపలాడింది. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమరయోధుల పుణ్యఫలమే స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకొని దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఇంకా ఉర్దూ పాఠశాల, జడ్పిహైస్కూల్, మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, బిటి యూనివర్శిటి, ఎంపిడిఓ కార్యాలయాల్లో ఆయా అధికారులతో కలసి ఎమ్మెల్యే జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపిడిఓ తాజ్‌మస్రూర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, టిడిపి నేతలు నవీన్‌చౌదరి, మార్పూరి గాంధీ, రామ్మూర్తినాయుడు, చిప్పిలి గురునాథ్‌రెడ్డి, రాయల్, జాన్‌బాబు, ఎర్రబల్లి వెంకటరమణరెడ్డి, డ్యాన్స్ రెడ్డప్ప, నయాజ, ఖాదర్‌బాషా, చిన్న మహేష్, రాజేష్, తపిక్, నాయిబ్రాహ్మణ సంఘం మంజునాథ్, పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు దక్కిన నిజమైన స్వేచ్ఛ 'స్త్రీ శక్తి'

**రాజంపేట, ఆగస్టు 14 ప్రభాతవార్త**



కూటమి పాలనలో మహిళలకు దక్కిన నిజమైన స్వేచ్ఛ 'స్త్రీ శక్తి' పథకమని, ఆర్టీసీ ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం వరం లాంటిదని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు.అక్కాచెల్లెమ్మల ముఖాల్లో ఆనందమే ప్రభుత్వ విజయానికి నిదర్శనం అన్నారు. శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా, మహిళా సాధికారత కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాజంపేటలో 'స్త్రీ శక్తికి ఏడాదిరెట్టింపైన ఆత్మగౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సులో టికెట్ కొని మహిళలతో మాట్లాడారు. ఉచిత ప్రయాణం పై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమం, వారి ఆత్మగౌరవ పరిరక్షణే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రొద్దుటూరు అర్బన్ ఆగస్టు 15 ప్రభాతవార్త**

రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెడ్ల కళ్యాణ మండప ఆవరణలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించాల్సిన అవసరంపై మాట్లాడారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ చెట్ల సంరక్షణతోనే పర్యావరణాన్ని కాపాడుకోగలమన్నారు. మొక్కలు నాటడాన్ని ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. యువత, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపుతో ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ల సేవా సంఘం అధ్యక్షుడు నాగ దస్తగిరి రెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొవ్వూరు రమేష్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మార్తల సుధాకర్ రెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు రామ సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కేఎంఆర్ కందుల మునిరెడ్డి, గొట్లూరు శివరామిరెడ్డి, నరసింహారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, అన్నవరం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



# పక్కా ప్లాన్‌తో జంట హత్య..

## ఇద్దరు నిందితుల అరెస్ట్



**సుండుపల్లి,ఆగష్టు 15,ప్రభాతవార్త:**

మండల పరిధిలో ని మడితాడు గ్రామపంచాయతీ క్రిష్టారెడ్డి చెరువు దగ్గర గత నెల 22న జరిగిన ఇద్దరి మృతి కేసును పోలీసులు హత్య కేసుగా ఛేదించారు. చిన్నగొల్లపల్లికి చెందిన అబ్బన్నగారి జయరాం (44), రెడ్డిచెర్ల రవీంద్ర (45)లను వాహనంతో ఢీకొట్టి హత్య చేసి, ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది.పోలీసుల వివరాల మేరకు.. రవీంద్ర కుటుంబానికి, ప్రధాన నిందితుడు రెడ్డిచెర్ల శివశంకర్ కుటుంబానికి ఇంటి స్థలానికి సంబంధించి కొంతకాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రవీంద్రను హత్య చేయాలని శివశంకర్ తన స్నేహితులతో కలిసి పథకం రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారం అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనంతో జయరాం, రవీంద్రలను ఢీకొట్టి హత్య చేసినట్లు నిర్ధారించారు.కేసు దర్యాప్తులో సేకరించిన శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. పోలీసుల దర్యాప్తు వేగవంతం కావడంతో యేరికల శివప్రసాద్ (29), వాక శరణ్ రాజ్ అలియాస్ చరణ్ (30) శనివారం ఉదయం వీఆర్వో సమక్షంలో లొంగిపోయారు. అనంతరం వారిని సుండుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కేసులో ప్రధాన సూత్రధారి రెడ్డిచెర్ల శివశంకర్‌తో పాటు సానిపాయి కు చెందిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి అశోక్ లేలాండ్ బడా దోస్త్ , సుజుకి యాక్సెస్ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మాజీ సైనికులు

**ప్రొద్దుటూరు అర్బన్ ఆగస్టు 15 ప్రభాత వార్త**



స్వాతంత్ర్య విలువలను కాపాడుతూ దేశ గౌరవాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు నేట్ల బాల వీరా రెడ్డి అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఎగ్జిబిషన్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. గాంధీ రోడ్డులోని మహాత్మా గాంధీ, టీబీ రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎగ్జిబిషన్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. వయోవృద్ధ మాజీ సైనికులను సన్మానించారు. అనంతరం స్వచ్ఛసంకల్ప మహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి మాజీ సైనికులు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఏపీ పీరయ్య, కార్యదర్శి శంకర్ రెడ్డి, ట్రెజరర్ శాంబశివారెడ్డి, అడ్వైజర్ ఎల్లయ్య, దస్తగిరి, మోహన్, హుసేన్ వల్లి, సింగం శివారెడ్డి, మాజీ సైనికులు, వీరనారీమణులు పాల్గొన్నారు. గార్డ్ ఆఫ్ ఆనర్‌లో పరేడ్ కమాండర్ నేట్ల బాల వీరా రెడ్డితో పాటు శంకర్, సుమిత్ర, చెన్నయ్య, నాగేశ్వరుడు, ఖాజా పీర, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, హుసేన్, దస్తగిరి, శివకుమార్, శివప్రసాద్, బాల దస్తగిరి, విశ్వనాథ, కొండారెడ్డి, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, రవిశంకర్ పాల్గొన్నారు.

# పింఛా ప్రాజెక్టు క్రింద మాడుగులో పడి ఒకరి మృతి

**సుండుపల్లె, ఆగష్టు 15,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టు దిగువ బాగాన వున్న పింఛా నది మడుగు నీటిలో పడి రాగి మానుబిడికి కి చెందిన ఒక వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం సాయంత్రం పింఛా నదిలో కొందరు చేపల వేట నిర్వహిస్తుండగా మండల పరిధిలోని మాచిరెడ్డి గారి పల్లె పంచాయతీ రాగిమానుబిడికి గ్రామానికి చెందిన మూడే ప్రవీణ్ నాయక్ (42)అక్కడికి వెళ్లి చూస్తూ ప్రమాదవ శాత్తు జారి నది నీటిలో పడి మాడుగులోపల చిక్కుకుని మృతి చెందినట్లు తెలిపారు. ప్రక్కనే వున్న చేపల వేట గాళ్ళు వెంటనే తేరుకుని నీటిలో గాలించగా నీటి లోపల చిక్కుకున్న ప్రవీణ్ నాయక్ ను వెలుపలికి తీయగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తరలించారు. మృతుని భార్య కువైట్ లో ఉండగా, కుమార్తె కుమారుడు వున్నారు.దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పులివెందులలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పులివెందుల, ఆగస్టు 15, ప్రభాతవార్త :**





దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆశ్రమాలు, రాజకీయ పార్టీ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణతో పాటు దేశభక్తి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి యువత బాధ్యతాయుతంగా కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ బి .శ్రీనివాసులు ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ యు. శ్రీనిత, శివరామిరెడ్డి, సుగుణ, ఓబుల్ రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లయోలా డిగ్రీ కళాశాల (వై.ఎస్.ఆర్.ఆర్.)లో కరస్పాండెంట్ రెవ. ఫాదర్ డా. ప్రభుదాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ రెవ. ప్రొఫెసర్ ఫాదర్ ఎల్. జోజి రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రెవ. ఫాదర్ డా. సి.హెచ్. వానచిన్నప్ప, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వీర నారాయణస్వామి అంధుల ఆశ్రమంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, వంగపీటి రాధారంగ మిత్రమండలి జోనల్ కార్యదర్శి నక్కా సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఆశ్రమ వాసులకు అల్పాహారం పంపిణీ చేశారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బి. మురళీ నాయక్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందితో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్వో నజీర్ అహ్మద్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, మినీ సెక్రటేరియట్‌లో ఆర్డీవో చిన్నయ్య ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి, మారెడ్డి భరత్ రెడ్డి, వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించి, దేశభక్తి, జాతీయ ఐక్యత, అభివృద్ధి సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశానికి లభించిన స్వాతంత్రం అమరవీరుల త్యాగాల ఫలితమేనని వైఎస్ఆర్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ మధు రెడ్డి, చవ్వా దుశ్యంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పట్టణంలోని భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గోటూరు చిన్నప్ప, హాల్ గంగాధర్ రెడ్డి, హఫీజ్, చంద్రమోళి, రసూల్, కోళ్ల భాస్కర్, కోడి రమణ, కనక, రిషికేశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, బ్యాటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వై. నవీన్ ఆధ్వర్యంలో 'ప్రతి ఇంటికి త్రివర్ణ పతాకం' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'దేశమే మొదటి ప్రాధాన్యత' స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

డా.ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ), ఏపీజెన్‌కోలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ జీఎం వాసుదేవరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీఏవీ హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలపించిన వందేమాతరం మరియు జనగణమన గీతాలతో కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో కొనసాగింది. ఎస్‌పీఎఫ్ సిబ్బంది చీఫ్ ఇంజినీర్‌కు గార్డ్ ఆఫ్ హానర్ అందజేశారు. కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఫైర్ స్టేషన్ ఆవరణలో చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, దేవేంద్ర నాయక్, మధుసూదన్‌రావు, భరత్‌కుమార్‌రెడ్డి, ఎఫ్యాక్టరీ మేనేజర్ (ఈఈ) హమ్మన్న, అసిస్టెంట్ కమాండెంట్ విజిలెన్స్ సీఐ నారాయణ యాదవ్, డీఎఫ్ చారి డివిజనల్ ఫైర్ అధికారి, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సేఫ్టీ ఆఫీసర్లు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు ప్రశంస పత్రం

**వేంపల్లె ఆగష్టు 15 ప్రభాతవార్త**



పోలిస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన వేంపల్లె సీఐ టి.నరసింహులు ప్రశంస పత్రం అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం కడపలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా సీఐకు ప్రశంస పత్రం అందజేశారు. దీంతో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**బద్వేల్, ఆగస్టు 15, ప్రభాతవార్త**



మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మంచూరి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే నేడు దేశవ్యాప్తంగా ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించగలుగుతున్నారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేవలం టెట్ రద్దు కోసం ప్రయత్నాలు చేశాం

**వేంపల్లి ఆగష్టు15 ప్రభాతవార్త**



ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుండి మినహాయింపు లభించేలా మాత్రమే ప్రయత్నం చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రిగారిని కలవడానికి డిల్లీకి వెళ్ళి ప్రయత్నం చేశామని ఎక్కడా ఎవరితోనూ డియస్సి పైన వ్యతిరేకంగా మాట్లాడలేదని ఎవరికీ పిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డియస్సి నియమాలకపై యస్.టి.యు గా మాకు ఎటువంటి అనుమానాలు లేవని యస్.టి.యు జిల్లా అధ్యక్షుడిగా ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుండి మినహాయింపు లభించేలా కేంద్ర విద్యాశాఖ మంత్రిగారికి వినతిపత్రం ఇచ్చేలా కృషి చేశామని అలాగే పార్లమెంటులో విద్యా హక్కు చట్టం లోని 23 వ సెక్షన్ ను సవరించేలా జిల్లాలో అందరు ప్రజా ప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేశామని అంతవరకే పరిమితం అయ్యామని అలాగే గత పది రోజుల నుండి జరుగుతున్న టెట్ ఆన్ లైన్ పరీక్షలలో ప్రశ్నా పత్రాలలో అత్యంత కఠినాత్మకంగా ప్రశ్నల సరళి ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయుల తీవ్ర ఆందోళన నెలకొని ఉన్న పరిస్థితుల్లో ఇన్ సర్వీస్ టీచర్ల ఆందోళన తగ్గించడం కోసం టెట్ రద్దు కోసం మాత్రమే ప్రయత్నం చేశానని తెలిపారు.ఈ పరిస్థితుల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి వచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులపై ఆధారాలతో కూడిన వివరణ ఇచ్చి అధికారులు కలుస్తామని సంగమేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మైదుకూరు,ఆగస్టు 15, ప్రభాతవార్త:**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాయల్ సర్కిల్ నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. కడప రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చలమయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్రం కోసం ఎంతోమంది జాతీయ నాయకులు పోరాటం చేసి దేశానికి స్వేచ్ఛను సాధించారని పేర్కొన్నారు. వనిపెంట రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బందితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ప్రత్యేక అధికారి ఏ. మురళి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆధ్వర్యంలో, ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో కె.వి. శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. మైదుకూరు మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి దేశభక్తి నినాదాలతో స్వాతంత్ర్య వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**రాజుపాలెం, ఆగస్టు 15, ప్రభాతవార్త**



మండల పరిధిలోని గ్రామ గ్రామాన వాడవాడలా ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి జాతీయ జెండాలు ఎగురవేసి వందనం సమర్పించారు. ఎంపీడీవో సురేష్ బాబు స్వాతంత్ర దినోత్సవ విశిష్టతను వివరిస్తూ స్వాతంత్ర సమరయోధుల త్యాగఫలమే స్వేచ్ఛ స్వాతంత్రం అని కొనియాడారు. తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ హరినాథ్‌రెడ్డి, పోలీస్ స్టేషన్లో ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి, ప్రాథమిక సహకార సంఘం నందు ప్రెసిడెంట్ బాష, కరెంటు సబ్ స్టేషన్ నందు ఏఈ వేణుగోపాల్, మండల విద్యాశాఖ కార్యాలయంలో రామస్వామి రెడ్డి, ప్రసాద్‌లు జాతీయ జెండా ఎగరవేసి, జాతీయగీతం ఆలపించి స్వాతంత్ర సమరయోధుల గురించి స్మరించుకొని వందనం సమర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు కొత్త ఉత్సాహంతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని మిఠాయిలు పంచుకున్నారు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

## ఐదు మందికి సేవలకు ఉత్తమ అవార్డ్స్

**పీలేరు ఆగస్టు 15 ప్రభాతవార్త:**



తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో వివిధ జాతీయ రాష్ట్రీయ ఆరోగ్య సేవల, నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన ప్రగతిని విజయవంతముగా అమలు, మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు ఆదర్శప్రాయమైన కృషికి గుర్తింపుగా. 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య , పి హెచ్ యన్, యం.కుసుమ, హెల్త్ అసిస్టెంట్ పి.సి రెడ్డెప్ప,ఏ యన్ యం. యం ప్రమీల కుమారి ,ఐదు మందికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారులు లక్ష్మీ నరసయ్య చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డులు ప్రదానం చేయడం జరిగింది.ఇందుకు పి హెచ్ సి అధికారులు మరియు సిబ్బంది ఆనందం వ్యక్తపరిచారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కలసపాడు, ఆగస్టు 15 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కలసపాడుపోలీస్ స్టేషన్ నందు శనివారం కలసపాడు ఎస్సై సుభాన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఎగరవేశారు అనంతరం జండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే మన దేశానికి స్వాతంత్రం లభించిందని త్యాగమూర్తుల ఫలితమే అన్నారు. దేశ ప్రగతికి పాటుపడిన త్యాగమూర్తులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనంత దక్షిత్‌కు మంత్రి అభినందనలు

**మదనపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త :**



చిన్నారిని అభినందిస్తున్న మంత్రి

మూడేళ్ళ చిన్నారి 79కిలోమీటర్లు స్కేటింగ్ ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతంగా పూర్తి చేసిన చిన్నారి అనంత దక్షిత్‌ను రాష్ట్రమంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం మంత్రి చిన్నారిని అభినందించి ఆశీర్వదించడం జరిగింది. అనంత దక్షితకు రెండు రోజుల క్రితం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు జెండా ఊపి మదనపల్లె నుండి కదిరి వరకు స్కేటింగ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. చిన్నవయస్సులో అసాధారణ ప్రతిభను ప్రదర్శించి, అద్భుతమైన లక్ష్యాన్ని సాధించిన దక్షిత్‌కు మంత్రి ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర వేడుకలు

**చాపాడు. ఆగష్టు 15 ప్రభాతవార్త :**
మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు తహసీల్దార్ రమాకుమారి జాతీయ పతాకం ఎగురవేసి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయం నందు మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎంపీడీవో మధుసూదన్, పోలీస్ స్టేషన్ నందు ఎస్సై. చిన్నపెద్దయ్య, వెలుగు కార్యాలయము నందు ఏపీఎం శ్రీధర్ జాతీయ పతాకం ఎగురవేశారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నందలూరు ఆగస్టు 15 ప్రభాతవార్త :**
అమరవీరుల త్యాగాల ఫలితమే మనకు లభించిన స్వాతంత్ర్యమని ఎంపీపీ మేడ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మేడ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో కె.ఆర్.ఎం. ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ ప్రకాష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మల్లికార్జునరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. విజ్డమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్లు వలిమి రాధా, రవీంద్ర రాజు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐదుగురు విశ్రాంత సైనికులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగ, నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశ్రాంత సైనికుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

## శ్రావణమాసం సందర్భంగా అన్నదానం



**ప్రొద్దుటూరు అర్బన్ ఆగస్టు 15 ప్రభాతవార్త**
శ్రావణ మొదటి శనివారం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ దగ్గర ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద రాష్ట్ర బీసీ సంఘాల జనరల్ సెక్రెటరీ గుండ్లూరు వెంకటరమణ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మొదట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి రైతులు, ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మండల అధ్యక్షుడు నంద్యాల రాఘవరెడ్డి, షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ చైర్మన్ ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ రాజువారి వెంకటసుబ్బయ్య, ఎనిమిదో వార్డు టిడిపి ఇన్చార్జి నాగరాజు, గోకుల్ నగర్ శంకర్ రెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ రజక సంఘం అధ్యక్షుడు చెన్నాయుడు పాల్గొన్నారు.

## రాజ్యాంగం వలననే మనకు స్వేచ్ఛ స్వాతంత్రం

**సుండుపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త :**



తాసిల్దార్ కార్యాలయంలో 8వ స్వాతంత్ర వేడుకలు తాసిల్దార్ వేణుగోపాల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి యొక్క కబంధహస్తాల్లో మగ్గిపోతున్న మనకు ఎంతోమంది త్యాగమూర్తుల వలన 1947 సంవత్సరం ఆగస్టు 15 తారీఖున స్వాతంత్రం రావడం జరిగిందని, ఆ తరువాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాల వారికి అట్టడుగున ఉన్నటువంటి వారికి అన్ని విధాల స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా మనము అనుభవించు కొంటున్నామనియు,అంబేద్కర్ రాజ్యాంగం వలననే మనము ఇప్పటివరకు స్వేచ్ఛ స్వాతంత్రంతో జీవిస్తున్నామంటే ఆయన చలువేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వీఆర్వో, వీఆర్ఏలు, పోలీసులు పాల్గొన్నారు .తర్వాత రాజంపేటలో సబ్ కలెక్టర్ భావన చేతుల మీదుగా తనకు ఉత్తమ సేవా పురస్కారం అందించడం జరిగిందని తాసిల్దార్ తెలియజేశారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 15 ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ ఆఫీస్, పోలీస్‌స్టేషన్, సహకార సంఘం ఆఫీస్ లో ప్రభుత్వ పాఠశాల మరియు ప్రవేట్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం జాతీయగీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అధికారులు నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్రా రెడ్డి, ఎంపిపి వీరనారాయణరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ యల్లటూర్ సాంబశివారెడ్డి, టీడీపీ నాయకులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, ఏఎస్ఐ సుధాకర్, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కలికిరిలో రెపరెపలాడిన జాతీయ జెండా

**కలికిరి, ఆగస్టు 15, ప్రభాతవార్త:**



మండలంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండా రెపరెపలాడింది. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎస్.సయిద్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అదే విధంగా కలికిరి పోలీసు స్టేషన్‌లో సీఐ అనిల్‌కుమార్, కలికిరి మేజర్ పంచాయతీలో ఈవో అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈ ముజీబర్ రెహమాన్, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ పవన్‌కుమార్ మర్రికుంటపల్లె పంచాయతీ సచివాలయంలో డిప్యూటీ ఎంపీడీవో వినయ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోన తపస్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలికిరి పంచాయతీ పురవీధులలో జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించి స్వాతంత్ర్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దేశం ముందుకు సాగేందుకు కృషి చేయాలని తహసీల్దారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో దేశభక్తి గీతాలకు నృత్యాలు





**కడప కార్పొరేషన్ ఆగస్టు 15 ప్రభాతవార్త:**
కడప శిల్పారామం లో 80 వ స్వాతంత్ర దినోత్సవము సందర్భంగా ఉదయం 8:30 శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయంత్రం 6:30 నిమిషాలు కు అర్జున్ డాన్స్ అకాడమీ వారిచే పిల్లలతో దేశభక్తి గీతాలుకు, జానపద గీతాలుకు నృత్యాలు చేసినారు. మేమే ఇండియన్ మేమే ఇండియన్, వరి మొగుడా వయారీ మొగుడా, జై హింద్ జై హింద్ వంటి గీతాలు అలరించాయి. యంత్రం శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారము సాయంత్రము 6:30కు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నయని తెలిపారు.



**బద్వేల్ ఆగస్టు 15 ప్రభాతవార్త:**
బద్వేల్ చెన్నంపల్లి ఆదర్శ ప్రాథమిక



పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీ షామీర్ హుస్సేన్ గారి అధ్వర్యంలో స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.పాఠశాల యాజమాన్య కమిటి చైర్మన్ శ్రీమతి శ్రీవేణి గారు జెండావందనం గావించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించారు.స్వాతంత్ర్య సమర యోధుల గురించి మాట్లాడారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు శ్రీ లక్ష్మీ నరసయ్య, శ్రీమతి శారదా శ్రీమతి నాగ పార్వతి శ్రీమతి మనోరమ గార్లు పాల్గొన్నారు. పోటీలలో గెలిచినవారికి బహుమతులు పంచారు. అందరికి స్వీట్లు పంచారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**బద్వేల్, ఆగస్టు 15, ప్రభాతవార్త**
బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో ఎ. చంద్ర మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. దేశభక్తి, ప్రజాసేవ, అభివృద్ధి లక్ష్యాలతో ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు దేశభక్తిని ప్రతిబింబించే పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. విద్యార్థినుల ప్రదర్శనను అధికారులు, సిబ్బంది అభినందించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 91 మంది అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వారిని అభినందించి, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై జయరాములు జెండాను ఆవిష్కరించారు.

## వాడవాడలా స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**దువ్వూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ హైస్కూళ్ల నందు శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను వాడ వాడల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి, ఎంపీడీవో జవహర్ బాబు, అలాగే తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ బి.సునీత, పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ ధనుంజయుడు, సహకార సంఘం నందు అధ్యక్షులు పోలు రామ్మోహన్ రెడ్డి తదితరులు జాతీయ జెండాను ఎగరవేశారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నందు ఎంఈఓ భాస్కర్, రమణలు కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా దేశం కోసం సేవలు అందజేసిన జాతీయ నాయకుల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐకు ప్రశంసా పత్రం

**దువ్వూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
దువ్వూరు పోలీస్ స్టేషన్ నందు పనిచేయుచున్న ఎస్ఐ ధనుంజయుడు కు స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కడపలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రశంసా పత్రం ను అందుకున్నారు. పోలీస్ శాఖలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంసా పత్రం లభించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి బి.జనార్దన్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ సమక్షంలో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.





## సింగసాని పరందామయ్య వర్ధంతి వేడుకలు

**బద్వేలు, ఆగస్టు 15, ప్రభాత వార్త**
నాటి సీనియర్ కాంగ్రెస్ నేత, దివంగత సింగసాని పరందామయ్య వర్ధంతి వేడుకలను బద్వేలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగసాని కుటుంబ సభ్యులు వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతిని పురస్కరించుకుని తెలుగుగంగ కాలనీలోని అనాథ ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం షాలోమ్ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు భోజనాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ గురుమోహన్ పాల్గొని అనాథ ఆశ్రమంలోని పిల్లలకు భోజనాలు అందించారు. దివంగత సింగసాని పరందామయ్య సేవలను కుటుంబ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు స్మరించుకున్నారు. సమాజ సేవా కార్యక్రమాలతో వర్ధంతిని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.





## జాతీయ జెండా ఆవిష్కరించిన ఇన్‌చార్జి జడ్జి

**నందలూరు ఆగస్టు 15 ప్రభాతవార్త :**
నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి పి. రాజన్ ఉదయ్ ప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం పోరాడిన నాయకుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు ప్రతి ఒక్కరు కావాలి

**వేంపల్లె ఆగస్టు 15, ప్రభాతవార్త**
క్రమశిక్షణ కలిగి సమిష్టిగా కృషి చేసి, దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలి,పిలుపునిచ్చారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వేంపల్లి పంచాయతీ పరిధిలోనీ అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో కాలేజీలలో కార్యాలయలో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా చైతన్య, ఉషాకిరణ్, స్వామీవివేకానంద, నారాయణ, శ్లోక, తేజ, లిటిల్ ఫ్లవర్,వికాస్,్ష, ఎంపీపీ మెయిన్, ఉర్దూ, భవిత, లైబరరీ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం లో తదితర ప్రభుత్వలో ఎందురో మహనీయుల త్యాగ ఫలితంగా స్వాతంత్రం లభించిందని, ఐకమత్యంతో దేశ ప్రగతికి పాటు పడాలని ఉద్బోవించారు. పిల్లలందరూ దేశభక్తిని కలిగి, బాగా చదువుకుని గొప్ప పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కవి ఆధ్యాత్మిక కేంద్రం చిన్నారులు వివిధ అంశాల్లో సాధించిన అద్భుత ప్రతిభను ప్రదర్శించి అలరించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలు, దేశభక్తిని ఉద్బోదించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ్ష లు వెంకటరామిరెడ్డి, స్టాలిన్, కరెస్పాండంట్ చక్రపాణిరెడ్డి, రమణ రెడ్డి, రామాంజనేయురెడ్డి, నారాయణ రెడ్డి, నవనేశ్వర్ రెడ్డి, మహదేవా రెడ్డి,మొబినా,రాఫియా,లైబేరియన్ వనజకుమారీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# ఆంజనేయస్వామి దేవస్థానం నాలుగో వార్షికోత్సవం

**పులివెందుల, ఆగస్టు 15 ప్రభాతవార్త :**
పట్టణంలోని ఆర్ఆర్ లేఔట్‌లో వెలసిన శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక హోమాలు నిర్వహించి స్వామివారికి విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రారెడ్డి సతీమణి ముని కుమారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

